క్లుప్తంగా

4న బాపట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బాపట్ల అర్బన్: స్థానిక మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ. రాధాకృష్ణ బుధవారం తెలిపారు. సమావేశానికి ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు అధ్యక్షత వహిస్తారని, సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

మున్నంగివారి పాలెం సర్పంచ్ మృతి



శ్రీనివాస్‌రెడ్డి

వేమూరు: మండలంలోని మున్నంగివారి పాలెం గ్రామ సర్పంచ్ తిప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి (54) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు కుమారుడు, భార్య ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని మంత్రి మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, మండల అధ్యక్షుడు గాదె శివరామ కృష్ణారెడ్డి, పార్టీ నేతలు సందర్శించి నివాళులర్పించారు.

ధర్మనిధి సభ్యత్వ కరపత్రాల ఆవిష్కరణ



భట్టిప్రోలు: సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ధర్మనిధి సభ్యత్వ కరపత్రాల్ని బుధవారం సేవా సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణ కోసం ప్రతి హిందువు సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, వేమూరు సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ క్రాప రవికుమార్, సభ్యులు టి. బాలాజీ, కె. భాగ్యలక్ష్మి, ఆర్. వీరబాబు, విమల పాల్గొన్నారు.


ఎరువుల షాపు తనిఖీ

జంపని(వేమూరు): ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం ప్రకటించిన ధరలకే అమ్మాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్. సునీత తెలిపారు. మండలంలోని జంపనిలో బుధవారం ఆమె ఎరువుల షాపును తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు తర్వాత రైతులకు బిల్లుల్ని తప్పక ఇవ్వాలని సూచించారు.

నేత కార్మికులకు 15 శాతం మజూరీ వేతనం పెంపు

చెరుకుపల్లి: స్థానిక సాయి రాజేంద్ర పారిశ్రామిక చేనేత సహకార సంఘ సొసైటీలో నేత కార్మికులకు మజూరీ వేతనం పెంచుతున్నట్లు అధ్యక్షుడు మర్రివాడ సత్యనారాయణ తెలిపారు. సంఘ పాలకవర్గ సమావేశాన్ని బుధవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నేత కార్మికుల్ని మరింత ప్రోత్సహించేందుకు గానూ ఫిబ్రవరి నుంచి గతంలో ఇచ్చిన మజూరు కంటే 15 శాతం పెంచుతూ సమావేశంలో తీర్మానించినట్లు ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని సొసైటీ ద్వారా నేత నేసే కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సొసైటీ పాలకమండలి సభ్యులు బట్టు వెంకటేశ్వరరావు, వంగరు సాయిబాబు, సంగాబత్తిని సామ్రాట్, కందుల లీలాకుమారి పాల్గొన్నారు.

జనవరి పండుగలో యువకుడికి గాయాలు



గాయపడిన రమేష్

కొల్లూరు: ఓ యువకుడు శరీరానికి మంటలు అంటుకుని గాయాలపాలైన సంఘటన మండలంలోని కిష్కింధపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లంక రమేష్ జనవరి పండుగలో భాగంగా తోటివారితో కలసి బాణసంచా కాలుస్తున్నాడు. భూమిపై పెట్రోలు పోసి మంటలు అంటించి, బాణసంచాతో సాహసకృత్యాలకు దిగారు. ఈ క్రమంలో రమేష్ కాళ్లకు మంటలు అంటుకుని గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

మత్తు పదార్థాలతో బతుకు అంధకారం

కర్లపాలెం: మత్తు పదార్థాల వినియోగంతో బతుకు అంధకారం అవుతుందని కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. ద్విచక్ర మోటారు వాహనదారులంతా హెల్మెట్ పెట్టుకోవాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ మంగళవారం పోలీసులు కర్లపాలెం సెంటర్‌లోనూ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం.శివయ్య మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణగా చదువుకోవాలని చెప్పారు.

పేదల బతుకుల్లో సంక్షేమ పథకాల వెలుగులు

- మంత్రి మేరుగ నాగార్జున
- క్రాపలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన



మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేదల బతుకుల్లో వెలుగులు పరుచుకున్నాయని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. క్రాపలో బుధవారం రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో అందజేసిన సంక్షేమ పథకాల గురించి ఆయన ప్రతి గడపకూ వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. పథకాలు అందినదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వివరించడానికి తమ ముంగిటకు వచ్చిన మంత్రికి ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న రోజుల్లో వెన్నుదన్నుగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని లబ్ధిదారుల్ని కోరారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల్ని ఆదుకోవాలన్న కాంక్షతో సంక్షేమ పథకాల్ని అమలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ దండగ అంటూ వ్యాఖ్యానించడానికి ఖండించారు. ప్రజా సంక్షేమాన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని మంత్రి కోరారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజల్ని మోసగించిన టీడీపీ తిరిగి అధికారం దక్కించుకోవడానికి వేస్తున్న కుప్పిగంతులకు ప్రజలు కరిగిపోరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు తనయుడు లోకేష్ చేస్తున్న యువగళానికి ప్రజా స్పందన కరువైందని, అసలు ఆయన గురించి పట్టించుకోవాల్సిన అవసరమే లేదని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన ప్రతి కుటుంబం వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తీసుకురావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు ఉన్న నమ్మకమే తిరిగి తమను గెలిపిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు హిందు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరడంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు బావిరెడ్డి వెంకట్రామయ్య, సర్పంచులు సనకా వెంకట్రావు, శీలం అంకమ్మరావు, క్రాప ఉప సర్పంచ్ గొరికపూడి అంకమ్మరావు, మాజీ సర్పంచులు బొల్లా వీరరాఘవయ్య, కట్టుపల్లి సోమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, బొల్లా శ్రీను, మునిపల్లి రత్తయ్య, కల్యాణ్, సాంబయ్య, ఆలపాటి వెంకటేశ్వరరావు, మాదల నాగేశ్వరరావు, మురాల ఫణికుమార్, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఆసరాగా సీఎం జగన్

ఎమ్మెల్యే కోన రఘుపతి



నవరత్నాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్ : ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటికే పింఛన్లను పంపిణీ చేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఆసరాగా నిలిచారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని మురుకొండపాడులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. ఎమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలపై ప్రజలంతా సంతృప్తికరంగా ఉన్నారని చెప్పారు. మూడున్నరేళ్ల పాలనలో 95 శాతానికి పైగా హామీల్ని నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతోందని తెలిపారు. ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, సర్పంచ్ వజ్రమ్మ, వడ్డిముక్కల డేవిడ్, గవిని కృష్ణమూర్తి, ఎంపీడీవో రాధాకృష్ణ, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమ



అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త దుర్గమ్మతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్

భట్టిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కార్యకర్తలు, ఆయాలు అలసత్వం వహిస్తే సహించేది లేదని బాపట్ల జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమ హెచ్చరించారు. ఇటీవల ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి భట్టిప్రోలు బీఆర్ స్కూలులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు గుర్తించి రికార్డులో నమోదు చేశారు. దీనిపై పీడీ ఉమ బుధవారం భట్టిప్రోలు వచ్చారు. బీఆర్, ఉర్దూ, దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాల్ని పరిశీలించారు. బీఆర్ కేంద్రంలో కార్యకర్త సీహెచ్. దుర్గమ్మను కేంద్రం నిర్వహణలో అలసత్వం చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెకు మెమో జారీ చేసినట్లు తెలిపారు. ఉర్దూ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు అనువుగా లేదని, వెంటనే అద్దె భవనంలోకి మార్చాలని కార్యకర్త సునీతకు సూచించారు. రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కేంద్రాల నిర్వాహకులు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి విధి నిర్వహణలో పాటించాల్సిన సూచనలు, జాగ్రత్తల్ని తెలియజేయనున్నట్లు పీడీ ఉమ తెలిపారు. ఆమె వెంట అమృతలూరు సీడీపీవో వి. విజయలక్ష్మి, రేపల్లె ఇన్‌చార్జ్ సీడీపీవో డి. మాణిక్యం, సూపర్‌వైజర్ ఫయాజున్నీస్సా, మహిళా పోలీస్ కె. తిరుమల ఉన్నారు.

ఉపాధి పథకం పనుల్ని సద్వినియోగం చేసుకోవాలి

డ్వామా పీడీ శంకర్ నాయక్



నగరంలో పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

నగరం: ఉపాధి హామీ పనుల్ని కూలీలంతా సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ వై. శంకర్ నాయక్ చెప్పారు. మండలంలోని నగరంలో పనుల్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో కూలీల వలసల్ని నివారించేందుకు పనులు దోహదపడతాయన్నారు. కూలీలకు పనుల్ని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన అన్ని మౌలిక వసతుల్ని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

బొరమాదిగపల్లిలో ..

మండలంలోని బొరమాదిగపల్లి గ్రామ సచివాలయాన్ని బుధవారం డ్వామా పీడీ తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో రికార్డుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది విధుల్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలపై వచ్చే అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. లక్ష్యాలు సాధించే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల్ని ఇబ్బంది పెడితే చర్యలు

సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి



రైతులతో మాట్లాడుతున్న సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి

కర్లపాలెం: రైతులు విక్రయించిన ధాన్యానికి ట్రక్కు షీట్ జనరేట్ చేయడంతో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లైబాపట్ల జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలో ఆర్‌బీకేల ద్వారా విక్రయించిన ధాన్యానికి ట్రక్కు షీట్ జనరేట్ చేయడంలో గంటలకు గంటలు ఆలస్యం అవుతుందని రైతులు ఫిర్యాదు చేయడంతో బుధవారం సివిల్ సప్‌లై జిల్లా మేనేజర్ కర్లపాలెం వేబ్రిడ్జిని సందర్శించారు. అక్కడ ఉన్న రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం వేబ్రిడ్జికి తీసుకువచ్చిన తరువాత జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ అధికారులు, పేరలి వ్యవసాయ పరపతి సంఘం అధికారులు ట్రక్కుషీట్ జనరేట్ చేయడంలో గంటలకు గంటలు ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. ధాన్యం తరలించాల్సిన మిల్లుల అడ్రస్ సక్రమంగా తెలపడం లేదని ఫిర్యాదు చేశారు.జిల్లా మేనేజర్ మాట్లాడుతూ కర్లపాలెం మండలం మొత్తంలో ఒకే వేబ్రిడ్జి ఉండటంతో పాటు సర్వర్ కలవకపోవడం వల్ల ఆలస్యమవుతోందని, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేరలిలో రైతుల సౌకర్యం కోసం ఇప్పుడున్న డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు ఇంకొకరిని నియమిస్తామని శ్రీలక్ష్మి తెలిపారు.

5న అమరవీరుల స్మారక సభ

రేపల్లె: పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటరులో రేపల్లె తాలూకా అమర వీరులు స్మారక సభని పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్ ఆసరా బీమా సాయం పంపిణీ



బాపట్ల అర్బన్: ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని హైదర్‌పేట నివాసి బొనిగల మంగబాబు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ ఆసరా బీమా పథకం కింద వారి కుటుంబానికి రూ. 10వేలను బాపట్ల ఈటీపీఆర్‌ పులి శరత్‌బాబు అందించారు. కార్యక్రమంలో ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, గ్రామ పెద్దలు బొనిగల డేవిడ్ రాజు, మోర్ల సముద్రాలు గౌడ్, కరి వెంకట రాజ్యలక్ష్మి, మహిళా పోలీస్ మేదూరి సుప్రియ, వలంటీర్ వాణి పాల్గొన్నారు.

నేడు మాజీ సైనికుల సమస్యలపై సమావేశం

రేపల్లె: మాజీ సైనికుల సమస్యలు, వాటి పరిష్కారానికి గానూ గురువారం ఉదయం 10 గంటలకు బ్రిగేడియర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మత్స్యకార భవనంలో సమావేశం జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులంతా పాల్గొనాలని వారు కోరారు.

తల్లిపై దాడి చేసిన కొడుకుపై కేసు నమోదు

కొల్లూరు: తల్లిపై దాడి చేసిన కేసులో కొడుకు, కోడలుపై కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని జువ్వలపాలెం శివారు కొత్తగూడేనికి చెందిన దున్న నాంచారమ్మ పెద్ద కొడుకు వెంకటేశ్వరరావుతో కలసి ఒకే ఇంటిలో వేర్వేరుగా నివసిస్తున్నారు. అయితే, వెంకటేశ్వరరావు తల్లిని అసభ్యపదజాలంతో దూషిస్తూ, కొడుతుండటంతో గ్రామంలో ఉన్న చిన్న కుమారుడు శ్రీనివాసరావు వద్ద ఉంటోంది. ఇటీవల గ్రామ పెద్దల సమక్షంలో చర్చలు జరిపి పెద్ద కుమారుడు ఉంటున్న ఇంటిలోనే వేరే గదిలో ఉండాలని నిర్ణయించడంతో అక్కడ ఉండేందుకు మంగళవారం వెళ్లింది. ఆ గదిలో ఉన్న పెద్ద కుమారుడి సామగ్రి ఖాళీ చేయాలని కోరడంతో, ఆమె కోడలు సుహాసిని, కొడుకు వెంకటేశ్వరరావు నాంచారమ్మతో పాటు, ఆమె చిన్న కుమారుడు శ్రీనివాసరావుపై దాడికి దిగి గాయపరిచారు. తెనాలి వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

ఏడీఏ పద్మలత

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయ ఏడీఏ పద్మలత సూచించారు. మండలంలోని ఖాజీపాలెంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ క్లస్టర్ పొలంబడిలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మినుము, వేరుశనగ పైర్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విచక్షణారహితంగా రసాయనిక మందులు వినియోగించరాదని, అవసరమైతేనే వాడాలని సూచించారు. పురుగు ఉద్ధృతిని బట్టి పైరు 26 రోజుల సమయంలో ఎకరానికి 500 ఎం.ఎల్. వేప కషాయాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. దీనివల్ల మూడు రకాల ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. మల్టీకే ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల పూత, పిందె అధికంగా రావడంతో పాటు మొక్కల్లో వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పంట కోతకు 20 రోజుల ముందు మరోసారి మల్టీకే వాడటం వల్ల గింజ దృఢంగా తయారవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అనూరాధ, బాపట్ల ఏడీఏ లక్ష్మి, ఏఓ సత్యానంద్, ఏఈఓ సుదర్శనరావు, వీఏఏలు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

'జగనన్న స్వచ్ఛ సంకల్పం' విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎలీషాబాబు

కర్లపాలెం: గ్రామాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ, సచివాలయం కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఎలీషాబాబు మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాలు పరిశుభ్రంగా రూపుదిద్దుకొంటాయని చెప్పారు. సంపద సృష్టి కేంద్రాల్ని వినియోగించుకుని పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని కార్యదర్శులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న సంపద సృష్టి కేంద్రాల పనుల్ని త్వరగా పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకురావాలని చెప్పారు. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేయాలని చెప్పారు. మండలం మొత్తం ఇంటి పన్నులు రూ.90లక్షలకు గానూ ఇప్పటి వరకు 65శాతం మాత్రమే వసూలైనట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరుకు నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి రాకముందే చెరువుల్ని నీటితో నింపుకోవాలని సూచించారు.

హత్య కేసు కొట్టివేత

తెనాలి రూరల్: సాక్ష్యాధారాలు రుజువు కానందున హత్యకేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి కొత్తపేటకు చెందిన కొఠారి సామ్రాజ్యం రేపల్లె రూరల్ సర్కిల్ నగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020 నవంబర్ 3న హత్యకు గురయ్యారు. హంతకులు ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకుని మృతదేహాన్ని కాలువలో పడేసి వెళ్లారు. నగరం పోలీసులు కేసు నమోదు చేసి, బాపట్ల సమీపంలోని బేస్తవారిపాలెంకు చెందిన పోతార్లంక శ్రీనివాసరావు, అతని భార్య పద్మావతిని నిందితులుగా పేర్కొంటూ చార్జ్‌షీట్ దాఖలు చేసి వారిని కోర్టులో హాజరుపరిచారు. కేసు తెనాలిలోని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జి. మాలతి, నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుల తరపున న్యాయవాదులు ఎస్‌టీ ప్రసాద్, షేక్ ఫిరోజ్‌బాషా, పేట ప్రత్యూష వాదనలు వినిపించారు.

వైభవంగా ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట మహోత్సవాలు

రేపల్లె రూరల్: కారుమూరులో చెన్నకేశవస్వామి ఆలయ ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. పండితుల వేదమంత్రాల నడుమ బుధవారం ఉదయం నుంచి చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, అగ్నిధ్యానపూర్వక పంచసూక్త హోమాలు, యంత్రన్యాస, రత్నన్యాస, ధాతు న్యాసాలు, శాంతి కళ్యాణం, మహాపూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. ఉదయం 9.27గంటలకు శిలా ధ్వజ పునఃప్రతిష్ఠ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నసంతర్పణ చేశారు.

నదీ భూముల వివాదంలో పలువురిపై కేసు నమోదు

కొల్లూరు: నదీ భూముల దగ్గర జరిగిన వివాదంలో పలువురిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసినట్లు కొల్లూరు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని పెదలంక అరవింద వారధి వద్ద మంగళవారం నదిలోని భూములు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న ఎస్సీ వర్గానికి చెందిన చింతర్లంక, పెదలంక గ్రామాలకు చెందిన వ్యక్తులకు, మరో వర్గానికి చెందిన వ్యక్తులకు ఘర్షణ జరిగింది. ఇందులో చింతర్లంకకు చెందిన గుంటూరు ఏసోబు, తోడేటి రాజేష్, తోడేటి రవి స్వల్పంగా గాయపడ్డారు. ఇందులో ఏసోబు చేసిన ఫిర్యాదు మేరకు వీరిపై దాడికి పాల్పడిన పెసర్లంక, పెదలంక గ్రామాలకు చెందిన ఉప్పు కృష్ణారావు, తోట సాంబశివరావు, జొన్నకూటి ఏకాంబరం, కూరేటి శివయ్య, సింగం శ్రీనివాసరావు, సింగం కృష్ణప్రసాద్, వెలవల బసవరత్తయ్యతో పాటు, పెదలంక డీలర్ ఇద్దరు కుమారులు, మరి కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

బాపట్ల: పట్టణంలోని పదో వార్డు పరిధిలో చెన్నూరు జకరయ్య ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో బుధవారం వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి ఇనగలూరి మాల్యాద్రి రూ. 10వేల ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాలు మేరకు జకరయ్య నివాసానికి వెళ్లి ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోముల రాజశేఖర్‌రెడ్డి, బీసీ నాయకులు ఉప్పాల మురళి, ఉసులూరి వీరరాజశేఖర్, సిందిరెడ్డి వెంకటరెడ్డి, గుత్తి దేవ సహాయం, సచివాలయం సిబ్బంది వేణు, ఆనంద్ పాల్గొన్నారు.

సాయి భక్తుల భిక్షాటన

బాపట్ల: పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా 27వ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో బుధవారం సాయిబాబా భక్తులు భిక్షాటన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం వరకు నిర్వహిస్తారు. అదే రోజు కర్పూరహారతి ఉంటుంది. సోమవారం అఖండ దీప స్థాపన, అఖండ నామ సప్తాహం, మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణ ప్రజలంతా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

గురుకుల పాఠశాల తనిఖీ



చుండూరు(వేమూరు): చుండూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను బాపట్ల జిల్లా మలేరియా సూపర్‌వైజర్ జూగుంటి రాంబాబు, గుంటూరు సబ్ యూనిట్ అధికారి పిడికిలి నరేంద్ర బుధవారం సందర్శించారు. పాఠశాల గదులు, మూత్ర శాలలు, మరుగు దొడ్లు, వంటశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల గదులతో పాటు వంటశాల, పాత్రల్ని శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన లేదా క్లోరినేషన్ చేసిన తాగునీటిని అందించాలని చెప్పారు. వేసవి ప్రారంభంలో అతిసార, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న దృష్ట్యా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, చుండూరు మండల వైద్యాధికారి ఆశీర్వాదం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవునికి తులసి దళార్చన

జంపని(వేమూరు): భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జంపని చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. స్వామికి పూజారి మేడూరు శ్రీనివాస్‌మూర్తి తులసి దళార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణాధికారి శ్యామసుందర్‌బాబు పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీవారి నిత్య కల్యాణం



బాపట్ల అర్బన్: స్థానిక త్యాగరాయనగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్య కల్యాణ మహోత్సవాలు బుధవారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు ఆదివారం వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి 7 గంటలకు శాంతి హోమం, ఆదివారం గరుడోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయ ధర్మకర్త ఉడతల శ్రీనివాస్, సంపత్ కుమార్, అర్చకులు సుదర్శనం చక్రవర్తి, యజ్ఞేనస్వామి, పరాశరం రామాచార్యులు, శ్రీనివాస సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళలు అభివృద్ధి సాధించాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం శ్రీనివాసులురెడ్డి సూచించారు. ప్రభుత్వ పథకాలపై బుధవారం నల్లమోతు వారి పాలెంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. వైఎస్సార్ బడుగు వికాసం, పీఎంఈజీపీ పథకాలలో భాగంగా కర్లపాలెం మండలంలో సుమారు రూ.1.20 కోట్లకు పైగా సబ్సిడీ రుణాలు మంజూరు చేశామని తెలిపారు. గ్రామ సమైక్య సంఘాల ఆడిటింగ్ పూర్తి చేశామని తెలిపారు. సీసీలు పూర్ణచంద్రరావు, వీవోఏలు పాల్గొన్నారు.